సుబ్బిగాడు కళ్లు తెరిచేసరికి అమ్మ ఒళ్లో వున్నాడు. పైన పచ్చని కొబ్బరిచెట్ల నీడ విస్తూంది. పక్కన రెండు సత్తుగిన్నెలు. చిన్నబట్టలమూట. అమ్మ ఒక్కర్తే కాదు. అక్కడ చాలామంది వున్నారు. చెట్లనీడల్లో కూర్చుని కునికిపాట్లు పడుతున్నారు. సుబ్బిగాడికి ఏదో భయమేసింది. "అమ్మా" అంటూ తల్లిని కరుచుకున్నాడు. ఆరోజు వాడితల్లి పనికిపోలేదు. మధ్యాహ్నమయింది. పొద్దువాలింది. నీరసంగా తల్లిని కరుచుకుని పడుకున్న సుబ్బిగాడికి తన జీవితంలో పెద్ద మార్పుఏదో రానేవచ్చిందన్న భావం కలిగింది.

*          *          *

తెల్లవారింది. సుబ్బిగాడు కళ్లుతెరిచి కిటికీకోసరం వెతికాడు. కాని చుట్టూతా వెలుతురు — అంతా వెలుతురె. వాడి కళ్లకి ఆ వెలుగు మిరమిట్లు గొలిపింది. పక్కనే పడుకున్న తల్లిని "అమ్మా! దాహం" అంటూ లేపాడు.

ఆమె లేచింది ... నీరసంగా తూలుతూ, సుబ్బిగాణ్ణి వెంటేసుకుని వీధిలోకి వచ్చింది. కొత్తసందులు, పరిసరాలు, వాడు ఆసక్తిగా చూస్తూ, లేనిశక్తి తెచ్చుకుని, గబగబ అడుగు లేస్తున్నాడు. ఇంతలో ఓ దృశ్యం చూసి చటుక్కున ఆగిపోయాడు. ఆ స్థలం అతనికి చిరపరిచితంగా కనిపించింది. కానీ ఒక్కటే తేడా. ఇప్పుడక్కడ ఆ గుడిసెలు లేవు. మురుగు కాలవ లేదు. ఖాళీ స్థలం.

# తెల్లవారింది

విశాలంగా వుంది. అతి విశాలంగా పరచుకుని వుంది.


సుబ్బిగాడి మనసు ఓ క్షణం ఆనంద పడింది కళ్లు తళ తళ మెరిశాయి. "అమ్మా, తాత చెప్పిన మాట నిజమేనా? ఇక్కడ పెద్ద బంగళాలు వస్తాయా?" అనడిగాడు. తల్లి అతనివంక అయోమయంగా చూసింది. వెంటనే ఒంగి పిచ్చి సుబ్బిగాడి, పదేళ్ల ఆ చిన్నవాడి బుజం తట్టింది. "అప్పన్నా! ముందుకి పద" అంది.

తాత చెప్పిన మార్పు ఇదేనేమో! ఆ రోజు తెల్లటోపీ ఆయన వర్ణించిన మార్పు ఇదే లాగుంది. అక్కడ లేచే బంగళాలలో తనూ అమ్మా వుంటారా? ఎందుకుండకూడదు? సుబ్బిగాడి మనసు ఆనందంతో ఊగిసలాడింది. ఉత్సాహంతో గబ గబ ముందుకి అడుగు లేశాడు.

వాడి వెనకాలే ఉవ్వెత్తున దుమ్ము లేచింది. ఆ దుమ్ములో వాడి పాదాల గుర్తులు ఇట్టే చెదిరిపోయాయి.

సుబ్బిగాడి లాటివాళ్లు యింకా ఎందరో వున్నారు. వాళ్లంతా ఆ వీధిలో అడుగు లేస్తూ వెళుతూనే వున్నారు. ఉవ్వెత్తున లేచిన దుమ్ములో వాళ్ల పాదాల గుర్తులు చెదిరిపోతూనే వున్నాయి.

తూరుపున తెల్లవారుతూనే వుంది.




*[గత సంచిక తరువాయి]*

ఇంతలో అన్నపూర్ణమ్మ దేవయ్యయింటికి అమాంతంగా ఊడిపడింది.

"ఏమిరా అన్నయ్యా! మా అబ్బాయికి సంబంధాలు చాలా వస్తున్నై. ఎవరు వచ్చినా మేనరికం ఉందని చెబుతున్నాను. నువ్వేమో బెల్లంకొట్టిన రాయల్లే కూర్చున్నావు. పిల్లనిస్తానని అనవైతివి. ఒక కడుపున పుట్టిన వాళ్లం కదా — మనమే అడిగితే కొమ్ములూ గొలుసులూ పోతాయా అని నా అంతట నేనే బయలుదేరి వచ్చాను.తేల్చుకోవడానికే వచ్చాను.

ఆడపిల్లల వాళ్లకి ఒక సౌకర్యం ఉంటుంది. కావాలన్న మగపిల్లవాణ్ణి వెతుక్కోవచ్చు. మగపిల్లలవాళ్లు పిలిచిన చోటికే వెళ్లి, ఆ పిల్ల నచ్చిందో నచ్చలేదో చెప్పవలసిన వాళ్లేకాని, మీ అమ్మాయిని మా అబ్బాయికిస్తారా అని అడిగే అవకాశం లేదు. నువ్వూ నేనూ ఒక తానులో ముక్కలమే కనుక, బింకాలు పోకుండా, నేనే మీ అమ్మాయిని మా అబ్బాయికిమ్మని అడగడానికి వచ్చాను. వింటున్నావా వదినా!" అని భామమ్మనుకూడా హెచ్చరించింది.

"వింటూనే ఉన్నా. ఆయన అన్నయ్య. నువ్వు చెల్లెలివి. మధ్య నేనెవ్వరిని. నాదేమున్నది! పరాయిదాన్ని" అన్నది భామమ్మ.

"పప్పులేని పులగం ఉంటుందా వదినా! భార్యాభర్తలు ఎప్పుడయినా ఒకటే. మిగిలిన వాళ్లే పరాయివాళ్లు. రేపు కన్యాదానానికి పీట మీద కూర్చునే దానవు నువ్వు. నాకిష్టం లేదు నేను కూర్చోనంటే మా అన్నయ్య ఏం చేస్తాడు? నా కోసం, మీ యిద్దరిమధ్యా తేడా రాకూడదు. మీ క్షేమం కూడా నేను కోరవలసినదానను. మీ యిద్దరికీ యిష్టమయితేనే యీ సంబంధం కుదురుతుంది. నీ కిష్టంలేకపోతే, దీనివల్ల మీ యిద్దరి మధ్యా పొరపులు వస్తే నేను చేసుకోనే చేసుకోను."

"నా కిష్టంలేదు" అన్నది భామమ్మ నిష్కర్షగా.

"విన్నావా అన్నయ్యా!" అన్నది అన్నపూర్ణమ్మ.

"విన్నానమ్మా! విన్నాను. ఖంగుమని మాట్లాడింది మీ వదిన. నాకు చెవుడు లేదుకదా అమ్మా."

"కారణం కనుక్కో."

"కారణం కనుక్కునే వాడినయితే నేను

# మేనరికం

పైడిపాటి సుబ్బరామ శాస్త్రి

దేవయ్య నెల్లా అవుతాను! పిల్లకు చాలా సంబంధాలు చూశామమ్మా! ఒక్కటీ నచ్చ లేదు. ఎవరి లిఖితం ఎల్లా ఉంటే అల్లా జరుగుతుంది.''

''నేను బయలుదేరి వస్తూంటే బావ అననే అన్నారు నా పుట్టిల్లు – అని ఎగురు కుంటూ వెడుతున్నావు. నీకు శృంగభంగం అవుతుందని. వారన్నట్టే అక్షరాలా అయింది''

''ఈ శృంగం భంగం నీకు కాదు. నాకు!'' అన్నాడు గద్గద స్వరంతో దేవయ్య.

''ఇంకేం సరి – అన్నకు తగ్గ చెల్లెలు. చెల్లెలుకు తగ్గ అన్న! అయినా వదినా మా అమ్మాయి బి. ఎ. చదువుతోంది కదా! ఏమని వచ్చి అడిగావు చేసుకోవడానికి తగుదు నమ్మా'' అని ఉపహాసించింది భామమ్మ.

అన్నపూర్ణమ్మ దానికి సమాధానం చెప్ప దలచుకోలేదు. అయినా సన్నగా ''కావలసిన సంబంధంలో నాలుగు క్లాసులు ఇటయితే ఏముంది, అటయితే ఏముంది. అంతస్సులో చేసుకోవాలని ఉంటే అవేం పట్టింపుకు రావు వదినా! అయినా మిమ్మల్ని కట్నాలూ కానుకలూ ఏమయినా అడిగానా ?''

''అల్లా అడక్కపోవడంచేతేనమ్మా నువ్వు చవకయిపోయింది'' అన్నాడు దేవయ్య.

భామమ్మ దేవయ్య వంక చురచుర చూసింది. ''వత్తాసి బాగానే ఉంది'' అని పెదిమెలు కొరుక్కుంది.

మీనాక్షి యీ ప్రసంగం అంతా వింటూ కుమిలిపోతోంది.

అన్నపూర్ణమ్మకు రాత్రల్లా నిద్రపట్ట లేదు ఆమెకు వసారా గదిలో ప్రక్క వేశారు. భామమ్మ తన భర్త తన కెదురు చెప్పనందుకూ, మీనాక్షి కల్పించుకోనందుకూ సంతోషించి నిశ్చింతగా నిద్రపోయింది.

మీనాక్షి తెల్లవారకట్ట లేచివచ్చి అన్నపూర్ణమ్మ ప్రక్కలో పడుకుంది.

''అత్తా! నువ్వు ఏమీ అనుకోకు. మామూలుగా వస్తూపోతూ ఉండు'' అన్నపూర్ణమ్మకు కన్నీళ్లు ఆగలేదు. చేతితో మీనాక్షి కళ్లను చీకట్లో తడిమిచూచింది. కళ్ల వెంబడి నీరు కారుతున్నట్లు గమనించింది. ''పిచ్చిపిల్లా! ఊరుకో!'' అని గట్టిగా కౌగలించుకుని కన్నీళ్లు తుడిచింది. ''వెళ్లమ్మా! నీ పక్కలోకి వెళ్లు. నీ అమ్మ తాటక, ఇప్పుడిక్కడ చూస్తే నీకు చివాట్లు, నాకు విసిరాట్లు తప్పవు. మా అన్నయ్య కనుక మీ అమ్మతో వేగుతున్నాడు'' మీనాక్షి వెళ్లలేక వెళ్లలేక వెళ్లిపోయింది.

అన్నపూర్ణమ్మ వెళ్లిన మరురోజు నుంచీ దేవయ్యను సంబంధాలు చూచిరమ్మని భామమ్మ ఇబ్బడి ముబ్బడిగా తొందర చేయసాగింది. పెళ్లిచూపులకు క్రొత్తవాళ్లు దిగారు. మీనాక్షి ఒకడికి ఆడంగిరేకుల వాడని పేరు పెట్టింది, నడక, మాట, చూచి. ఒకడు 'సైరన్' కూసినట్లు మాట్లాడుతాడని వంక పెట్టింది, వేరొకడికి మనస్సులో పాలుతాగే మనిషనీ, నూతులో పడ్డట్టుగా మాట్లాడుతాడనీ వంక పెట్టింది మీనాక్షి పెట్టిన యీ వంకలన్నీ న్యాయమైనవే అని భామమ్మ తృప్తిపడింది. ఒక సంబంధం వస్తే–యీ సంబంధానికి మా అమ్మాయి ఏ వంకా పెట్టడానికి వీలులేదని అనుకుంది. తల్లిని లోపలికిపిల్చి మీనాక్షి '' బాబోయ్ '' అంది.

'ఏమిటంది' తల్లి.

''వేళ్లు చూశావా, బండలు. రూళ్ల కర్రలల్లేఉన్నై. ఏమీ నాజూకులేవు కొడితే ఒక్క దెబ్బతో వైకుంఠమే'' అన్నది.

తల్లి మళ్లీ బయటకు వచ్చి పెళ్లికొడుకు వేళ్లవంకకు చూచింది. సరిగా అల్లాగేఉన్నై.

''మా అమ్మే! ముందుగా చెప్పావు. లేకపోతే నిలువునా నీ గొంతుక కోసేదాన్ని'' అని ఆ సంబంధం వదలుకొంది.

బి. ఎ. ఫైనల్ యియరు పరీక్షలు దగ్గరకు వచ్చేస్తున్నై. కాలేజీ నుండి సాయంత్రం ఏలూరురోడ్డుమీదుగా ఇంటికి పోతోంది మీనా ఒకరోజున. రోడ్డు వెంబడి కులాసాగా నడిచి వెడుతోంది. దారిలో బావ 'సుందరం' కన్పించాడు.

''ఎప్పుడొచ్చావ్ బావా''

''పదకొండు గంటలకు వచ్చాను''

''భోజనానికి మా యింటికి వెళ్లలేదా?''

''వెళ్లలేదు. హోటలులోనే భోజనం చేశాను.''

''అదేమిటి - బావా !''

''ఆ యింట్లో నాకు స్థానంలేదు,మీనా''

మీనాక్షి కళ్లలో నీళ్లు తిరిగినై.

''బావా! ఈ హోటలులో కాఫీ అయినా తాగుదాం, రా, బావా''

''అల్లాగే''

ఇద్దరూ వెళ్లి ఫామిలీ రూములో కూర్చున్నారు.

''స్వీట్—ఏమి కావాలిసార్'' అన్నాడు సర్వర్.

''రెండు బాదం కేకులు'' అన్నది మీనాక్షి. తెచ్చాడు. ''బావా! నీకు తీపి చాలా ఇష్టం కదూ!''

''నాకేది యిష్టమో నీకింకా జ్ఞాపకం వుందా మీనా.''

''ఉన్నది. బావా! నేను ఏదీ త్వరగా మరచిపోయేదాన్ని కాదు. నా కేకులో కూడా సగం తీసుకో బావా!'' అని తుంపి సుందరం ప్లేటులో పడవేయబోయింది.

''వద్దు వద్దు'' అంటూ అడ్డం పెట్టబోతుంటే మీనా వేళ్లు తగిలినై.

''వేళ్లు వదులు బావా! వేళ్లకంటె కేక్ తియ్యగా వుంటుంది''

సుందరం సిగ్గుపడ్డాడు.


''బావా! మైసూర్‌పాక్ తిందామా ?''

మీనాతో కాలక్షేపానికి వీలుగా ఉంటుం

## రాలిన ముత్యాలు

శ్రీ సోమసుందర్

కలిమి ఉంటే ఈర్ష్య పడేవాళ్లూ
లేమి ఉంటే చీదరించుకొనేవాళ్లూ
అని బంధువులంటే ఇటీవల
ఒక కొత్త అర్థం స్థిరపడింది.




## కుచేలకథలోని అంతరార్థం

శ్రీకృష్ణుని బాల్యమిత్రుడు కుచేలుడు గర్భదరిద్రుడు. గంపెడంత సంసారాన్ని భరించడం సాధ్యం కాలేదు. ఆకలితో పరితపిస్తున్న పిల్లల దీనాలాపాలను వినలేక- భార్య ప్రోత్సాహంవల్ల ద్వారకకు పోదలచాడు. శ్రీకృష్ణుణ్ణి యాచిస్తే కొంత ధనం ఇవ్వగలడని అతని విశ్వాసం. ఉత్తచేతులతో అతని వద్దకుపోకూడదు కనుక, ముక్కిపోయిన అటుకులు మూడుపిడికిళ్లు తన అంగవస్త్రాన మూటకట్టుకుని మరీ బయలుదేరాడు. ఎంతో శ్రమపడి ద్వారకను చేరుకున్న కుచేలుడు తనకు శ్రీకృష్ణుని దర్శనం సులభంగా లభించదేమో అని సందేహపడ్డాడు. కాని, సులభంగానే ఆ మహనీయుని దర్శనం లభించింది. అతడు ఆప్యాయతతో తనతోపాటు తన తల్పంపై కూర్చుండబెట్టుకుని ఎంతో గౌరవించాడు, కుచేలుణ్ణి.

కుచేలుడు తానెందుకువచ్చినదీ చెప్పుకోలేకపోయాడు. అయినా శ్రీకృష్ణుడు సంగతిని గ్రహించి 'నాకు కానుకగా ఏమిటి తెచ్చా' వంటూ, అతడు సిగ్గుపడి ఇవ్వకపోయినా, అంగవస్త్రం మూట విప్పి,అటుకులు తీసుకుని నోట్లో వెసుకుని ఎంతో తృప్తిని పొందాడు. అదే పదివేలనిపించింది కుచేలుడికి. మర్నాడు ప్రొద్దున ఏమీ ఇవ్వకుండానే కుచేలుణ్ణి శ్రీకృష్ణుడు సాగనంపాడు. ఊరికివచ్చి చూసే సరికి తన సంపదను చూచి కుచేలుడు ఎంతో ఆశ్చర్యపడ్డాడు. అతని కష్టాలుగట్టెక్కాయి. ఈ కథవల్ల ఒక విశేషార్థాన్ని ఊహించవచ్చును.

శ్రీకృష్ణుడూ, కుచేలుడూ బాల్యమిత్రులంటే—జీవాత్మ, పరమాత్మలకు సంబంధం ఉన్నదన్నమాట. జీవాత్మ మాయకు లోబడి, అనేక జన్మలను పొంది, పరితపించడం కుచేలుని కుటుంబ వృత్తాంతం సూచిస్తూ ఉన్నది. తుదకు జీవుడు ఆలోచించి, పరమాత్మను చెందడానికి చేసే పెద్ద ప్రయత్నమే ద్వారకానగర ప్రయాణం! జీవుడు ప్రారబ్ధ, సంచిత కర్మలను మూటకట్టుకుని వుండడమే కుచేలుడు అంగవస్త్రంలో కటుకున్న ముక్కిపోయిన అటుకుల మూట. పరమాత్మను చేరేటప్పుడు ఆ కర్మబంధం విడిపోవాలికదా! శ్రీకృష్ణుడు ఆ మూటను విప్పి,అటుకులను ఖాళీ చేశాడంటే—పరమాత్మ జీవాత్మను కర్మబంధంనుంచి విడిపించినాడని అభిప్రాయం. ఇక జీవాత్మకు కావలసినదేమున్నది ? అతడు పరమాత్మను చేరుకుని, పరమానంద భరితుడైనాడు !

కుచేలుని దారిద్ర్యం తొలగిపోయి, అతడు శ్రీకృష్ణుని అనుగ్రహంవల్ల సమస్తైశ్వర్య సంపన్నుడైనాడంటే – జీవాత్మ పరమాత్మను చేరి నిర్భరానందాన్ని లనుభవించాడనే. ఇక జన్మ పరంపరా సంబంధం లేక ముక్తిని పొందాడనీ గ్రహించాలి.

---

దని సుందరం ఊరుకున్నాడు. సర్వర్ తెచ్చాడు.

"తినకుండా కూర్చున్నావేం బావా"

"తినేస్తే, మళ్లీ నీ ప్లేటులోది తుంపి వేస్తావు. నువ్వు పూర్తిగా తినేదాకా నేను తినను"

"సరేలే- పాపం స్వీటు ఎదురుకుండా పెట్టుకుని ఏంతసేపు కూర్చుంటావ్" అని గబగబా తన ప్లేటులోది తాను తినేసింది.

"ఇందాక నువ్వు వేసిన సగం కేకు తిన్నాను. ఇప్పుడు నువ్వు సగం మైసూర్ పాక్ తినాలి."

'బలే పేచీ వేశావే'

"అవును. ఫిఫ్టీ–ఫిఫ్టీ"

"నాకు తీపి సయించదు. అంతా నువ్వే తిను బావా!"

"మధుర పదార్థం సహించకపోవడమేమిటి! వేషం కాని"– అని గడ్డం చేత్తో పుచ్చుకు నోరు తెరచి నోట్లో కుక్కాడు. మీనా తినేసింది.

"నేను నీ నోట్లో వేశానా బావా! నువ్వు

## మేనరికం

నా నోట్లో ఎందుకు వేయాలి."

"నువ్వు నా నోట్లో ఎందుకు వేయక పోవాలి"

"బాగుంది వరుస నీది మోటసరసం బావా! అందుకనే మా అమ్మకు నన్ను నీకివ్వడం ఇష్టం లేనిది"

సుందరం చిన్నపుచ్చుకున్నాడు.

"ఏం బావా అలా ఉన్నావు. నీకు కష్టం కలిగించానా?"

"అల్లా చెప్పిందా మీ అమ్మ"

మీనా పకపకా నవ్వింది. "అల్లా చెబుతుందా?"

"పోనీ నేను మోటసరస మాడనని వ్రాసి ఇస్తే మీ అమ్మ ఒప్పుకుంటుందా?"

"పేచీలు నీకూ తెలుసు."

సర్వర్ వచ్చాడు. "రెండు ప్లేట్లు కారబ్బూంది" అన్నది మీనా గంభీరంగా. సర్వర్ తెచ్చాడు.

"నేను నీ నోట్లో వెయ్యాలని నీకు మనసుగా ఉందిగా పాపం! పోనీ తీర్చుకో" అని ఒక చెంచా కారబ్బూంది సుందరం నోట్లో వేసింది.

సుందరం కళ్లల్లో నీళ్లు తిరిగినై. అది చూచిన మీనా కళ్లల్లో కూడా నీళ్లు తిరిగినై. సుందరం తన ప్లేటులో కారబ్బూంది ఒక చెమిచా మీనా నోట్లో వేశాడు.

'మీనా' అన్నాడు నిట్టూరుస్తూ.

"చెప్పు బావా!"

"చాలా మంది వచ్చి నిన్ను చూసి వెళ్లారుటగా!"

"చూశారు. వెళ్లారు."

"ఏం. వాళ్లల్లో ఎవరూ నచ్చలేదా ?

"ఏం ప్రశ్న – బావా, అది! నువ్వుకూడా క్యూలో నుంచోకపోయావా ?"

మీనా ప్రశ్నలో కొంచెతనం ఉన్నా, అనేతీరులో విచారమే ప్రకటించింది.

"నేను క్యూలో నుంచోడానికి కూడా అర్హుడను కానుకదా!"

మీనా కళ్లవెంబడి బొట బొట నీరు కారింది. సుందరం జేబు రుమాలతో

తుడిచాడు.

"స్వీటు తినేటప్పుడు మన ప్రసంగం తియ్యగా ఉంది. హాటు తినేటప్పుడు కారంగా ఉంది బావా! అనుకుని, బావా నువ్వు పెళ్లి చేసుకోరాదా ?"

"ఎవరిని ?"

"ఎవరినో ఒకరిని"

"ఎవరినో ఒకరిని చేసుకోక ఎల్లాగూ తప్పదు. కానీ నీపెళ్లి అయ్యేదాకా నేను పెళ్లి చేసుకోను. నిన్ను పెళ్లిపీటలమీద ఆశీర్వదించి మరీ చేసుకుంటాను"

"గుండె కోసేస్తున్నావు బావా!"

"నీకింకా గుండె ఉంది మీనా. మీ అమ్మ మా అమ్మతో పిల్లనివ్వనని చెప్పిన తర్వాత నాకున్నది అసలుగుండె కాదు. ఇనపగుండె"

సర్వర్ లోపలకువచ్చి "కాఫీ తీసుకురానా సార్!" అన్నాడు.

'ఊ' అన్నది మీనాక్షి.

"మీనా! నేను యస్. యస్. యల్. సి. మాత్రమే చదువుకున్నాను. నువ్వు బి.ఎ. అన్నదిటగా మాతృదేవత!"

"నేను బి.ఎ. అయినందుకు నీకు బాధగా ఉన్నదా బావా"

"లేదు. సంతోషంగా ఉంది. కాని ఆ సంతోషంవలన ప్రయోజనం ఏమిటి ?"

"ఊరికే ఇంట్లో కూర్చోలేక చదువు తున్నాను బావా! అయితే నువ్వూ ప్రయివేటుగా చదివి డిగ్రీ తీసుకోరాదా!"

"తీసుకోవచ్చు అల్లాచదివినతర్వాతనైనా మీ అమ్మ ఇస్తుందని నమ్మకం ఉంటే"

"ఆడవాళ్ల చదువు ఏం చదువులే బావా! వేగంవస్తుంది వేగంగా మరిచిపోతారు"

"ఎవరు చెప్పారు ?"

"పోతన్నగారు చెప్పారు ప్రహ్లాదుడు గర్భంలో ఉండగా నారదులవారు వేదాంతో పదేశం చేస్తే, గర్భంలో ఉన్న తనకు జ్ఞప్తి ఉన్నదనీ, ఆడదికనుక తల్లి మరచిపోయిందనీ"

"అయితే భాగవతం బాగా చదువులా వన్నమాట"

కాఫీ త్రాగుతున్నారు.

"బావా! భాగవతంలో నాకు బాగా నచ్చింది రుక్మిణీ కల్యాణం. నువ్వు చదివే ఉంటావు బావా!"

"కాఫీ స్టిమ్యులెంటు."

మీనా కోపంగా చూచింది.

"అమ్మతో అన్నాను మీనా! రుక్మిణీ కల్యాణం మోస్తరుగా మీనా కల్యాణం చేసే స్తానని. అమ్మ ఒప్పుకోలేదు. రాక్షస వివాహం రాచవారికిగాని మనకికాదు. అది కూడా ప్రశస్తంకాదు. అన్నయ్య ఉమూరు మంటాడు. మనకు అప్రతిష్ఠ అన్నది. ఆ తలపులుకూడా మూసుకున్నయి. అయినా, రుక్మిణి అగ్నిద్యోతనుణ్ణి పంపించింది. మీనా ఎవరిని పంపించింది ?"

"పో! బావా! సముఖమ్మున నేటికి రాయబారముల్ – అని నువ్వు పాడుతూ ఉండేవాడివికదా!"

బిల్లు తీసుకువచ్చాడు సర్వర్. "అసలే చిన్న రూము. ఒక్కొక్కరు గంటన్నర కూర్చుంటే ఎల్లాగంటున్నారండీ మానేజరు"

"అన్నాడూ! సైంధవుడు."

"అబ్బా! చాలాటయిమయింది" అంది మీనా, చేగడియారం చూస్తూ.

"బిల్లు నేనిస్తాను" అన్నాడు సుందరం.

"పానశాల మర్యాద ఏమిటంటే – ఎవరు ఆర్డరిస్తే వారే యివ్వడం."

## ప్రకృతి : ప్రగతి

డా॥ సి. నారాయణరెడ్డి

ఇసుక రేణువు —
మంచు బిందువు ...
ఒకటి తడిసేది
ఒకటి తడిపించేది.
ఒకటి మెరిసేది
ఒకటి మెరిపించేది.

ఇసుకకు మెరుపొస్తుంది
మంచు కురిస్తే.
పెదవికి తళుకొస్తుంది
నవ్వు విరిస్తే.

మంచులో తడిసిన ఇసుకే
మండుతుంది నిప్పులా.
నవ్వుతో విరిసిన పెదవే
పొంగుతుంది ఉప్పెనలా.
ఒకటి వేసవిలో
ఒకటి విసుగులో.

*

అది పరిణమించే ప్రకృతి
ఇది ప్రతిఘటించే ప్రగతి.

"నేను ఇవ్వకపోతే నాకు తృప్తి ఉండదు మీనా!"

"నువ్వు మా యింటికి రాలేదుగా! నేను కాఫీ అన్నా ఇవ్వకపోతే నా మనస్సు బాగుండదు."

"అయితే నీ హాండ్‌బాగ్‌లో డబ్బుతీసి నేనే యిస్తాను" అని లాక్కున్నాడు.

"అబ్బ! అధికారం!"

సర్వర్ డబ్బుతో వెళ్లిపోయాడు.

"బావా! బాగ్ తీసుకున్నావు సరే. దానిలో వందరూపాయల నోటు ఎందుకు పెట్టినట్లు!"

"మీనా! మన పెళ్లి కాదని నూటికి తొంబది తొమ్మిది పాళ్లు తేలిపోయింది కదా! ఈ నోటు నీ దగ్గర మార్చకుండా అట్టిపెట్టు. ఎప్పుడయినా బావ జ్ఞాపకం వస్తూఉంటాడు."

"చంపేస్తున్నావు బావా!" కన్నీళ్లు ధారలుగా కారుతున్నై. "మా పని చితికి పోయిందని తెలిసికూడా మా అమ్మ బోలెడు కట్నంపోసి నాకిష్టంలేని పెళ్లి చేస్తానం టుంది. వట్టి మూర్ఖురాలు బావా!"

"నా గుండెను ఎంత ఇనుము చేసుకున్నా, నీ కన్నీళ్లు చూస్తే నా కన్నీళ్లు ఆగడం లేదు మీనా!"

సర్వర్ చిల్లర ఇచ్చాడు. ఇద్దరూ లేచారు.

"నేను బస్సుకు వెళ్లిపోతున్నాను మీనా! ఇల్లు దగ్గరే అయినా జాగ్రత్తగా వెళ్లు. వాహనాలు త్రాగి తోలుతూ ఉంటారు."

"బావా! నమస్కారం. భగవంతుడు డనేవాడు ఒకడు ఉన్నాడుకదా!"

"నేనూ అలాగే అనుకుంటున్నాను, నువ్వు అన్నతర్వాత."

సుందరం వెళ్లిపోయాడు. మీనాక్షి! యిల్లు చేరుకుంది. బావతో తీరుబడిగా మాట్లాడుతున్నంతసేపూ గుండె ఎంతో తేలికగా ఉంది... ఆ సంభాషణ భావన చేసిన కొద్దీ గుండె బరువవుతోంది... బావ ఎంత సంస్కారం కలవాడు – అనుకుంది. అందు కనే మామయ్య చదువు కంటె సంస్కారం ప్రధానం అన్నాడు అని అనుకుంది. కట్నం లేకుండా పెళ్లి చేసుకుంటాననడం, తన పెళ్లి అయేదాకా పెళ్లి చేసుకోననడం ఇవన్నీ ప్రేమకు త్యాగానికీ చిహ్నాలు నిజానికి తన ప్రేమ, త్యాగం ఎంతవరకుంది అని ఆత్మ

వరీక్ష చేసుకోసాగింది. తల్లి దొడ్లో పని పురమాయిస్తోంది.

"ఆలస్యం అయిందేం తల్లీ! ఇంటికి రావడానికి!"

"బావ కనపడ్డాడు నాన్నా! మధ్యాహ్నం వచ్చాట్ట! హోటలులో భోజనం చేశాడుట!"

"మనింటికి రమ్మనక పోయావా అమ్మా"

"ఆ యింట్లో నాకు స్థానం లేదనేశాడు"

"ఏం చేస్తామమ్మా! నాతో రహస్యంగా చెప్పు. అసలు బావను చేసుకోవడం నీ కిష్టమేనా ?"

"నీ కిష్టమయితే నాకిష్టమే నాన్నా"

తన గదిలోకి వెళ్లిపోయింది మీనా. సిగ్గు పొరలలో దుఃఖం తొంగిచూచింది.

* * *

మీనాక్షి బి. ఎ. ప్యాసయింది. ఈ లోపుగా వారి కుటుంబ పరిస్థితులు తారుమారయిన్నై. కొట్లు ఎత్తేశారు. ఋణం చాలా పెరిగిపోయింది. అప్పులవాళ్లు ఎగబడుతున్నారు. కారు అమ్మివేశారు. 'గళ్లు' మని ఒక్కసారిగా బోర్డు తల్లక్రిందయింది. ఉద్యోగాల్లో ప్రవేశించిన మీనాక్షి సోదరులు మిగిలిన ఇద్దరి తమ్ములకూ చదువులకు డబ్బు పంపుతున్నారు. వాళ్ల ఉద్యోగాలు కూడా అంత పెద్దవేమీ కాదు. ఉన్న ఇల్లు నిలిచే స్థితి లేదు. దాని మీదకూడా అప్పుఉంది. ఇల్లు నిలవడం కోసం భామమ్మ ఒంటిమీద బంగారు నగలన్నీ అమ్మేసి నకిలీ నగలు కొనుక్కుంది. అయినా కొంత ఋణం ఉండనే ఉంది. మీనాక్షి పెళ్లి సంగతి ఆలోచించినవారే లేరు. భామమ్మకు కృత్రిమపు హోదా అంతా పోయింది. గొప్పవాళ్ల యింటికి రాకపోకలు సున్నా అయిన్నై. పులివలె జీవించిన భామ నేడు పిల్లిఅయి ఊరుకుంది.

"సంసారం పచ్చిగా ఉన్నప్పుడు పెళ్లి చేస్తానే అంటే, ప్రతివాడికీ వంకలు పెట్టింది అమ్మాయి. తల్పేదు సంసారం ఇప్పుడు బుట్టలోకి వచ్చింది. ఇప్పుడు పిల్ల పెళ్లి ఎల్లా" అంది ఒకనాడు దేవయ్యతో.

"ఏం చేస్తాం! విధి విలాసం! పోనీ, సుందరానికి ఇంకా పెళ్లి కాలేదుగా. చేసుకుంటాడేమో."

"బి.ఏ. ప్యాసయిన అమ్మాయిని చూస్తూ చూస్తూ స్కూలుఫైనలు వాడికిస్తామా ? ఉద్యోగమయినా చేయిస్తాం కాని—"

"చింత చచ్చినా పులుపు చావదు"

# మేనరికం

అన్నాడు దేవయ్య.

"మీరు పెళ్లిచేస్తే చేయండి, మానితే మానండి — కాని కూలిపని మాత్రం నేను చేయను" అంది మీనాక్షి అందుకుంటూ.

"ఉద్యోగం దేనికమ్మా! ఎన్ని ఇబ్బందులు! ఆ పని నాకూ యిష్టంలేదు" అన్నాడు దేవయ్య.

"అంత ఉద్యోగం ఇష్టం లేకపోతే, మీ మేనల్లుడికే తీసుకెళ్లి కట్టపెట్టండి. పిసుక్కు తినడానికి అన్నం ఉందిగా" అన్నది భామమ్మ కసిగా.

"మనకు అదీలేని స్థితి వచ్చిందిగా. వాకిట్లోకి వచ్చినప్పుడు మనం కాదని తీరా ఇప్పుడిస్తామంటే వాళ్లేమంటారో!"



కామలక్ష్మి పేరులో పత్రికల్లో కథలు రాస్తున్నది నేనే! మాష్టారూ ?

సుబ్బలక్ష్మి పేర్తుతో మీా కథలు బావుండవని పత్రికల్లో ఉత్తరాలు రాస్తున్నది నేనే! మాష్టారూ ?

"ఏమీ అనరు. పువ్వుల్లో పెట్టి మరీ చేసుకుంటారు. బి. ఎ. ప్యాసయిందిగా కానప్పుడే చేసుకుంటామన్నారు. అసలు వాళ్ల ఘోషే కొట్టింది దీని పెళ్లికి. చివరకు వాళ్ల పంతమే నెగ్గుతోంది."

"నీ కంత ఆత్మవిశ్వాసమే ఉంటే నువ్వే వెళ్లి చెప్పిరా– పిల్లనిస్తానని"

"నే నేమయినా సరే వెళ్లను. మీరు అన్న, ఆవిడ చెల్లెలు. నే నెవరు మధ్య! మరి మీ వదినకు ఇష్టమేనా అని అడిగితే, ఇష్టమే అనండి."

అన్న ఆస్తి పోయిందని విని చూడడానికి అన్నపూర్ణమ్మగారే వచ్చింది. 'ఓడలు బళ్లవుతై, బళ్లు ఓడలవుతై' అని ఓదార్చింది.

దేవయ్య చెల్లెలిని "మా అమ్మాయిని నీ కడుపులో పెట్టుకో అమ్మా" అని దీనంగా అడిగాడు.

"వదిన ఇష్టముంటే నే నెప్పుడన్నా కాదన్నానా అన్నయ్యా" అంది కళ్ల నీళ్లు పెట్టుకుంటూ.

"అప్పుడేమో పిల్ల చదువుకుంటోంది కదా అని అట్లా అన్నాం" అని ఊరుకుంది భామమ్మ.

వివాహం విజయవాడలో జరిగిపోయింది. గృహప్రవేశానికి మీనాక్షిని కలువపాములతీసుకు వెళ్లారు. కూడా సత్యభామమ్మ కూడా వెళ్లింది. కపిల గోవును చూడడానికి మీనా దొడ్లోకి వెళ్లింది. "మీనా ఆ ఆవే ఆవేళ తప్పించుకుపోయింది. తిరిగి తిరిగి కట్లు కొయ్య దగ్గరకు వచ్చింది. జ్ఞాపకముందా" అన్నాడు సుందరం. "మీ రెందుకంటున్నారో నాకు తెలుసు" అంది మీనా నవ్వుతూ.

"అందుకనే మా అమ్మ పల్లెటూరు వాళ్ల కివ్వనన్నది. వాళ్లది మోట సరసమని మా అమ్మకు బాగా తెలుసు" అని మళ్లీ అన్నది.

"అల్లాగా" అని గట్టిగా పట్టుకోబోయాడు సుందరం.

"అదే నేను మోటు సరసం అనేది– బలే చోటు దొరికింది. చూడండి. కపిలగోవు మీరు నన్ను పట్టుకుంటే తల ఎలా అడ్డంగా తిప్పుతోందో" అన్నది.

సుందరం కపిలగోవు వంక చూచాడు.

మీనాక్షి రివ్వున దూసుకొని వెళ్లి అత్త గారి ఒళ్లో కూర్చుంది.

"సరేలే– ఇప్పుడు కాదు" అని గట్టిగా కళ్లుమూసుకుని తెరచి చూపుడు వేలు జళిపించాడు సుందరం.

"చూడత్తా! బావ కొడతానంటున్నాడు" అని అంది మీనా!

"కొట్టడమ్మా! ఊరికే అలా అంటాడు. ఎవరయినా పెళ్లాన్ని కొడతారేమిటి ముద్దు పెట్టుకుంటారు కాని–"

"నువ్వు బరేదానివేలే అత్తా–" అని తుర్రున లేచి గదిలోకి వెళ్లిపోయింది మీనా. సుందరం మీనాను అనుసరించాడు.